ప్రజాశక్తి
శుక్రవారం 20 సెప్టెంబరు 2024

మాజీ మంత్రి 'గుండ'కు అస్వస్థత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అస్వస్థతకు గురయ్యారు. ఈనెల 16న అరసవల్లిలోని తన నివాసంలో ఉండగా వాంతులు కావడంతో ఈనెల 17న అతన్ని విశాఖపట్నంలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం ఆయన మెదడులో రక్తం కొన్నిచోట్ల గడ్డకట్టి ఉందని వైద్యులు నిర్ధారించారు. ఇంజెక్షన్ల ద్వారా వీటిని కరిగించడానికి ప్రయత్నించినా ఫలితం కనిపించకపోవడంతో, బుధవారం శస్త్రచికిత్స చేసి రక్తపుగడ్డలను తొలగించారు. ప్రస్తుతం ఆయన ఐసియులో ఉన్నారని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.

ఈ-పంట నమోదుకు గడువు పెంపు

- 23 వరకు పొడిగించిన ప్రభుత్వం
- 30న తుదిజాబితా ప్రకటన

సోంపేట : ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఖరీఫ్ సీజన్ ఈ-పంట నమోదు గడువును ఈనెల 23వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. తొలుత ఈనెల 15వ తేదీ నాటికే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయశాఖను ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో ఈనెల పదో తేదీ నాటికే సాగైన విస్తీర్ణంలో 90 శాతం విస్తీర్ణం పైబడి ఈ-పంట నమోదును ఆ శాఖ సిబ్బంది పూర్తి చేశారు. కీలకమైన విఆర్ఒ గుర్తింపు, గ్రామస్థాయి వ్యవసాయశాఖ అసిస్టెంట్ (విఎఎ) ద్వారా సాగుదారు కెవైసి కార్యక్రమాలు 80 శాతం మేర పూర్తయ్యాయి. పలు జిల్లాల్లో వరదల కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈనేపథ్యంలో ఈ-పంట నమోదు గడువును ప్రభుత్వం పెంచింది. ఈనెల 23వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆలోపు ఈ-పంట నమోదుతో పాటు కెవైసి ప్రక్రియనూ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ జాబితాలను ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ప్రకటించనున్నారు. వాటిపై వచ్చిన అభ్యంతరాలను ఈనెల 28, 29 తేదీల్లో పరిష్కరించి, తుదిజాబితాలను ఈనెల 30వ తేదీన ప్రకటిస్తారు. ఆమేరకు షెడ్యూల్‌ను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అందుకనుగుణంగా జిల్లాలో వ్యవసాయశాఖ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు.

సిఎం చంద్రబాబు పర్యటన రద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన రద్దయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కవిటి మండలం రాజపురంలో నిర్వహించనున్న రచ్చబండ ప్రారంభ కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొనాల్సి ఉంది. హెలీకాప్టర్ దిగేందుకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు నివేదించడంతో పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనసాగించనున్నారు.

కవిటి : ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ఎమ్మెల్యే

ఏర్పాట్లు పరిశీలన

కవిటి : 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి సిఎం చంద్రబాబు నాయుడు రానున్నారన్న సమాచారంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి గురువారం ఉదయం ఏడు గంటలకే రాజపురం చేరుకున్నారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి ఏర్పాట్లను స్వయంగా జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నారు. వింధ్యగిరిలో ఏర్పాటు చేయనున్న హెలీప్యాడ్ నుంచి రూట్ మ్యాప్, రాజపురంలో గ్రామసభ నిర్వహించే రచ్చబండ వేదిక ఏర్పాటు, తొలుత నలుగురు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారితో ముచ్చటించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను వారు స్వయంగా పరిశీలించారు. స్థానిక యంత్రాంగానికి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒ భరత్ నాయక్, ఎఎస్‌పి శ్రీనివాసరావు, డిఎస్‌పి వివేకానంద్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వారిపై కేసులు నమోదు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎఐసిసి నాయకులు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు పాల్పడిన చేసిన శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, బిజెపి నాయకులు త్రివేంద్ర సింగ్‌ను అరెస్టు చేయాలని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్ ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే విధానాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. ఈ విధానాన్ని రాహుల్ గాంధీ బట్టబయలు చేస్తూ ప్రశ్నిస్తున్నందుకు మోడీ ప్రభుత్వం జీర్ణించుకోలేక బిజెపి, మిత్రపక్షాల నాయకులు రాహుల్ వ్యాఖ్యలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

అనంతరం డిఎస్‌పి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, కె.వెంకటరావు, అంబటి దాలినాయుడు, కె.రామ్‌ప్రసాద్, ఎ.రవికుమార్, అంబటి రాజారావు, అంబటి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : రాహుల్ గాంధీపై బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డిసిసి మాజీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం టెక్కలి డిఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టెక్కలి, ఇచ్ఛాపురం, పాతపట్నం, నరసన్నపేట, ఎచ్చెర్ల నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీలు కిల్లి రామ్మోహనరావు, మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, కొప్పరోతు వెంకటరావు, మంత్రి నర్సింహమూర్తి, కరిమజ్జి మల్లేశ్వరరావు, డి.గోవింద మల్లిబాబు, కోత మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.సింహాచలం



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల ముందు వంశధార నిర్వాసితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచార సమయంలో కొత్తూరు మండల కేంద్రంలో చంద్రబాబు నిర్వహించిన రోడ్‌షోలో నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి హామీనిచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గానీ నిర్వాసితుల సమస్యలపై ప్రస్తావన చేయలేదన్నారు. జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా ప్రకటన చేయాలని కోరారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనే వంశధార నిర్వాసితులను బలవంతంగా కట్టుబట్టలతో గ్రామాలను ఖాళీ చేయించారని గుర్తుచేశారు. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావు నిర్వాసితుల సమస్యల పరిష్కారం విషయమై ముఖ్యమంత్రికి గుర్తు చేయాలన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షునిగా కృష్ణదాస్

శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకులుగా తమ్మినేని

ధర్మాన కృష్ణదాస్

తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మళ్లీ నియమితులయ్యారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను నియమించారు. తాడేపల్లిలో జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఎమ్మెల్సీలతో ఆ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి సమావేశమయ్యారు.

పార్టీకి కష్టకాలంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని భావించిన ఆయన, పార్టీ ఆవిర్భావం నుంచి తన వెన్నంట నిలిచిన కృష్ణదాస్ పైనే నమ్మకాన్ని కొనసాగించారు. అందులో భాగంగా మళ్లీ జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. మరోవైపు ఈ సమావేశానికి మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నాయకులు ధర్మాన ప్రసాదరావు గైర్హాజరయ్యారు. కొన్నాళ్లుగా జిల్లాలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాల్లోనూ ఆయన కనిపించడం లేదు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

ప్రభుత్వ న్యాయవాదిగా కృష్ణచంద్



శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఐదు న్యాయస్థానాలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది వాన కృష్ణచంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కోర్టు పరిధిలోని కుటుంబ న్యాయస్థానం ప్రభుత్వ న్యాయవాదిగా రెగ్యులర్ విధులు నిర్వహిస్తూ జిల్లా ఎస్‌సి, ఎస్‌టి కోర్టు.. సోంపేట జిల్లా సెషన్స్ కోర్టు, శ్రీకాకుళం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు, ఆరో అదనపు సెషన్స్ కోర్టులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో ఒకేసారి ఐదు న్యాయస్థానాలకు ప్రభుత్వం తరుపున న్యాయవాదిగా పనిచేసే అరుదైన అవకాశం ఆయనకు దక్కింది. ఈ సందర్భంగా ఆయనకు న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

చిందరవందరగా పడి ఉన్న దుస్తులు

పి.ఎన్ కాలనీలో చోరీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోపి పి.ఎన్.కాలనీ పదో లైన్‌లో తలుపులకు తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు తెరిచి చొరబడి భారీగా బంగారం, నగదు అపహరించుకుపోయారు. బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్టు ఎచ్చెర్ల పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంటి యజమాని సిహెచ్.రామ్మూర్తి బూర్జ మండలం కొల్లివలస ఎపి రెసిడెన్సియల్ స్కూల్లో మ్యాథ్స్ అసిస్టెంట్‌గా, ఆయన భార్య రమాదేవి కోటబొమ్మాళి బాలికల రెసిడెన్షియల్ స్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ వ్యక్తి పనుల నిమిత్తం ఈ నెల 14న బెంగళూరు వెళ్లారు. ఇంటి ప్రహరీ గేట్ తాళాలను మాత్రం పని మనిషికి అప్పగించారు. రోజూ పనిమనిషి వాకిలి కడిగి ముగ్గు వేసి వెళ్లిపోతుండేది. గురువారం ఏడు గంటలకు రోజు మాదిరిగానే గేటు తాళం తీసి లోపలికి వచ్చింది. అప్పటికే గ్రిల్స్ ప్రధాన ద్వారం తీసివుంది. ఇంటి యజమాని వచ్చారేమోనని బయటి నుంచే కేకలు వేసింది. ఎవరూ స్పందించకపోవడం, ప్రధాన ద్వారం కొంత పాడవడంతో పొరుగున ఉన్న వారికి సమాచారం ఇచ్చింది. దీంతో వారు బెంగళూరులో ఉన్న రమాదేవికి ఫోన్ చేయడంతో, ఆమె ఆమదాలవలసలో టీచర్‌గా పనిచేస్తున్న సోదరికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు, క్లూస్ టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. సమీపంలో ఉన్న సిసి టివిల్లో రికార్డు అయిన డేటాను సేకరించారు. దుండగులు ఇంట్లో చొర బడి రెండు బెడ్రూంల్లో ఉన్న అల్మరాలను, రెండు బీరువాలను తెరిచి బంగారం, నగదు అపహరించుకుపోయారు. బీరువాలు, అల్మరాల్లో బట్టలను, వస్తువులను చిందరవందర చేసి విలువైన వస్తువులను దోచుకొని పోయినట్టు పోలీసులు గుర్తించారు. ఇంటి యజమానులు లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఇంట్లో చోరి జరిగిన విషయం తెలిసిన రామ్మూర్తి, రమాదేవి దంప తులు బెంగళూరు నుంచి బయలుదేరి వస్తున్నట్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు ఎంతమేర బంగారం, నగదు అపహరణకు గురైందో తేలనుంది.

చేనేత సభ్యత్వ నమోదుకు నేడు ఆఖరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చేనేత సంఘాల సభ్యత్వ నమోదు ప్రక్రియ కోసం ప్రాథమిక చేనేత సహకార సంఘాల అధికారులను సంప్రదించాలని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు సిహెచ్.సాయిప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. సొంత మగ్గం ఉండి చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికులు సంఘ సభ్యత్వం తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక చేనేత సహకార సంఘం పరిధిలో మాత్రమే నమోదు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ లోగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. సంఘ సభ్యత్వం పొందిన వారు సహకార సంఘ సభ్యులుగా ఉంటారని వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న త్రిఫ్ట్ ఫండ్ పథకం, బీమా సౌకర్యం, బ్యాంకుల ద్వారా రుణ పరపతి తదితర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జిల్లాలో నూతన ప్రాథమిక చేనేత సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఒక్కో ప్రాథమిక చేనేత సహకార పరపతి సంఘంలో ఒకే ప్రాంతంలో నివాసముంటున్న కనీసం 30 మంది సభ్యులు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

వికలాంగుల గ్రీవెన్స్ వాయిదా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నేపథ్యంలో శుక్రవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించాల్సిన వికలాంగుల గ్రీవెన్స్‌ను వాయిదా వేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న జెడ్‌పి సమావేశ మందిరంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మార్పును వికలాంగులు గమనించాలని కోరారు.

మాట్లాడుతున్న జాతీయ బిసి సంక్షేమ సంఘ నాయకులు

మినీ రిజర్వాయర్లుగా చెరువుల అభివృద్ధి

ప్రజాశక్తి - పలాస

జిల్లాలోని చెరువులను మినీ రిజర్వాయర్లుగా అభివృద్ధి చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, సంఘ న్యాయసలహాదారు చౌదరి లక్ష్మణరావు, సంఘ ప్రతినిధులు ధర్మాన వెంకటరమణ, మహిళా విభాగం అధ్యక్షులు బద్రి సీతమ్మ డిమాండ్ చేశారు. పలాసలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారీ సాగునీటి ప్రాజెక్టులు వ్యయప్రయాసలతో కూడుకున్నవని, వివాదాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. భారీ ప్రాజెక్టుల నిర్వహణ కూడా కష్టతరమన్నారు. జిల్లా భౌగోళిక, నైసర్గిక స్వరూపం భారీ సాగునీటి ప్రాజెక్టులకు అనుకూలం కాదని గతంలో ఇంజినీరింగ్ నిపుణులు హెచ్చరించారని గుర్తుచేశారు. వంశధార, ఆఫ్‌షోర్ వంటి భారీ ప్రాజెక్టులు నేటికీ పూర్తి చేయలేకపోయిన విషయాన్ని గుర్తుచేశారు. చెరువులను మినీ రిజర్వాయర్లుగా అభివృద్ధి చేస్తే వరదల నివారణ సాధ్యం అవుతుందన్నారు.

మంత్రి ఆదేశాలు బేఖాతరు

తొలగని ఆక్రమణలు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పట్టణంలో ఆక్రమణలు జరిగితే సహించబోమని, ప్రస్తుతం ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వయంగా ఆదేశించారు. కానీ, రెవెన్యూ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని పలు ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని వాటి సర్వే నంబర్లతో సహాయ వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే హోదాలో అప్పటి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తదనంతరం టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి మంత్రి హోదాలోనూ రెవెన్యూ అధికారులకు ఆదేశిస్తూ... స్వయంగా ఆక్రమిత స్థలాలున్న ప్రాంతంలో పర్యటించారు. అయితే ఇప్పటికీ ఒక్క ప్రాంతంలో కూడా రెవెన్యూ అధికారులు తొలగించకపోవడంతో బాధితులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయ్యప్పనగర్‌కు వెళ్లే ప్రాంతంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం, సొండికుల సంక్షేమ సంఘం, పట్టుశాలీ సంక్షేమ సంఘం, ముస్లిములకు షాదీఖానా నిర్మాణాలకు ఒకొక్కరికీ ఐదు సెంట్లు చొప్పున స్థలాన్ని కింజరాపు అచ్చెన్నాయుడు అప్పటి టిడిపి హయాంలో కేటాయించారు. స్థలాల్లో నిర్మాణాలకు వెళ్లేసరికి వైసిపి ప్రభుత్వం హయాంలో 20 సెంట్లు స్థలాన్ని ఆదిఆంధ్రావీధికి చెందిన యర్ర భైరాగి ఆక్రమించుకున్నారని సంఘ తరగతి పెద్దలు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. కానీ, బాధితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదు సరికదా... కనీసం ఆక్రమణలైనా తొలగించలేకపోయారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రిని బాధితులు మరలా ఆశ్రయించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ... ఆక్రమిత స్థలాలను పరిశీలించి వాటిని తొలగించాలని ఆదేశించారు. ఆదేశించి రెండు నెలలు అవుతున్నా... ఇప్పటికీ వాటిని తొలగించకపోవడంలోని ఆంతర్యం అంతుచిక్కపోవడం గమనార్హం.

ఆక్రమిత స్థలం

రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కొందరు క్రిందిస్థాయి అధికారులు ఉన్నతస్థాయి అధికారులకు తప్పుడు సమాచారం అందించినట్లు సమాచారం. కాగా, స్థానిక ఇందిరాగాంధీ కూడలి నుంచి అంబేద్కర్ కూడలి వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించాల్సిన బాధ్యత రెవెన్యూ అదికారులపై ఉంది. కానీ, వారు బాధ్యతల నుంచి తప్పుకుని పంచాయతీ అధికారులపై నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నారనే వాదన వినిపిస్తుంది. ఇదిలా ఉండగా టెక్కలి పట్టణంలో రోడ్లు ఆక్రమణలకు గురయ్యారు. ఏదేమైనా టెక్కలి పట్టణంలో ఆక్రమణలు తొలగిస్తే త్వరగా అభివృద్ధి చెందుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

IN THE HONOURABLE COURT OF PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE AT VIZIANAGARAM.
C.M.A.No.3/2021.

Between:
Sri Kolagatla Venkata Naga Thammanna Setty.
.....Appellant.
And:
Smt. Karrothu Nirmala and 26 others.
.....Respondents.
To:
The addresses of the 19th Respondent:
Sri Sanchana Pradeep, S/o Vasudeva Rao, D.No.13-9-79/2, Manguvari Thota, Opp. Kamakshamma Temple, Near ZPH Office, Srikakulam.
The addresses of the 25th Respondent:
Smt. Saamanthula Sireesha, W/o Sambana Pradeep, D.No.13-9-79/2, Manguvari thota, Opp. Kamakshamma Temple, Srikakulam.

Please take notice that the above appeal filed by the appellant against you and others, which is posted to **30-09-2024** and you are directed to appear before the said Honourable Court at **10-30 A.M.** either personally or through an advocate, failing which the matter will be decided in your absence with the material available on record.

T.V.SRINIVASA RAO, M.A.BL
Advocate for the Appellant
Advocate & Govt. Pleader
H.No. 13-5-4, Kothapeta,
Vizianagaram

IN THE HON'BLE COURT OF JUNIOR CIVIL JUDGE AT ICHAPURAM.
EP.04/2021 IN OS.17/2019

Between:
GUJJU LOKANADHAREDDY
---Petitioner / D. H. R
And:
BIKRAM KESARI DAS ---Respondent /J.D.R

వేలం ప్రకటన

పై నెంబర్ అమలు పిటిషన్ లో J. Dr తాలూకా Schedule స్థిరాస్తి Decree Holder కి రావలసిన డిక్రీ సొమ్ము మరియు ఖర్చులతో సహా రాబట్టు నిమిత్తం తే॥ 15.10.2024 దిన పై కోర్టులో ఉ॥10.30 గంటల లగాయితు బహిరంగముగా వేలం వేయబడును. వేలంపాటలో పాల్గొనదలచిన వారు, వాది అడ్వకేట్ గారిని గాని, శ్రీ కోర్ట్ వారిని గాని సంప్రదించి పాట షరతులు తెలుసుకొనవలెను. ఇ.సి అన్యాకాంతములులేవు.

షెడ్యూల్ ఆస్థి

శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం సబ్ రి॥ కవిటి మండలం, పాత కొజ్జిరియా గ్రామం, రామయ్య వీధి లో గల డాబా ఇల్లు, Door No. 1-317, విస్తీర్ణం, ఉత్తరం నుండి దక్షిణంకు 70 అడుగులు లేక 21-33 మీటర్లు, వెడల్పు తూ॥ ప॥ కు॥ 10 అడుగులు లేక 3.04 మీటర్లు గలది. హద్దులు :- తూ॥ బిక్రమ్ కేశరిదాసు ఇల్లు D. No. 1-318, ప॥ జీరు ఉమాపతి ఇల్లు -1-316, ఉ॥ రోడ్డు, ద॥ ఖాళీ స్థలం
D. Hr విలువ Rs. 4,00,000/-
AMIN విలువ Rs. 15,00,000/-
Market విలువ -
వేలం తేదీ-15-10-2024.

(శ్రీ కోర్ట్ వారి ఉత్తర్వులు ప్రకారం)

యస్.యల్ నారాయణ
పి. వరలక్ష్మి
యు. భారతీదివ్య
న్యాయవాదులు, ఇచ్ఛాపురం.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కార్మికులు

ప్రజా పోరాట యోధుడు ఏచూరి

ప్రజాశక్తి- పొందూరు

ప్రజా పోరాటాల యోధుడు సీతారాం ఏచూరి అని, ఆయన మరణం శ్రామిక ప్రజానీకానికి, ప్రజాస్వామ్య శక్తులకు, దేశ ప్రజలకు తీరనిలోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. గురువారం శ్రీరాజ్యలక్ష్మి పోల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ నిర్వహించి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి కార్మిక, రైతాంగ పోరాటాల మార్గదర్శి అని, సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీ లేని పోరాటం చేసిన యోధుడన్నారు. విద్యార్థి దశ నుంచి ఐదు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలకు ఊపిరి పోసిన ఆయన మరణం కష్టజీవులకు నష్టమన్నారు. పార్లమెంటులో అనేక అమూల్యమైన ప్రసంగాలు చేసిన గొప్ప నాయకుడు మన మధ్య నుంచి దూరం కావడం అత్యంత బాధాకరమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాల కోసం, సమ సమాజం కోసం, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. ఈ సంతాప సభలో యూనియన్ నాయకులు పేడాడ అప్పలనాయుడు, కర్నేని గోవిందరావు, కోదండం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు పయనం

ఇచ్ఛాపురం : జ్ఞాన భారతి సిబిఎస్ఇ సీనియర్ సెకండరీ స్కూల్‌లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థి పాలెపు సాయి జగదీష్ చెన్నయ్‌లో జరుగుతున్న సిబిఎస్ఇ సౌత్ జోన్ క్లస్టర్-7 పోటీల్లో పాల్గొనేందుకు గురువారం పయనమయ్యారు. ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న పోటీలో పాల్గొంటారని జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి, సిఇఒ జోహార్‌ఖాన్ తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌ఫోర్ట్స మేనేజర్ అలీమ్‌ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ పండా పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

వరద బాధితులకు విరాళం

ప్రజాశక్తి- పాతపట్నం

వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.5 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను ఉండవల్లి నివాసంలో గురువారం కలిసి తన కార్యకర్తలతో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి ఉచిత మెగా డిఎస్‌సి కోచింగ్ సెంటర్‌ను సొంత నిధులతో పాతపట్నంలో ఏర్పాటు చేశానని అన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కూలడానికి సిద్ధంగా ఉన్న వంతెన
- చిద్రమైన రహదారి
- ఆందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని గుత్తావల్లి - కొల్లివలస ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో పాటు నాగావళి నది, నారాయణపురం ఆనకట్ట ఎడమ కాలువపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో సుమారు 30 గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. బూర్జ మండలంతో

గోతులమయంగా మారిన రహదారి

పాటు సంతకవిటి మండల మండల ప్రజలు శ్రీకాకుళం, పాలకొండ పట్టణాలకు వెళ్లేవారికి ప్రధాన వంతెన కావడంతో అనునిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. అయితే ముఖ్యంగా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక లారీలు, ట్రాక్టర్లు ఎడతెరిపి లేకుండా

భయంగా ఉంది

వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో భయంభయంగా ఉంది. భారీ వాహనాలతో పాటు ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తుండడం వలన వంతెన కూలడానికి సిద్ధంగా ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఎం.రాము, లాభాం

రహదారి గోతులమయం

రహదారి పూర్తిగా గోతులమయంగా తయారైంది. దీంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నారాయణరావు, లాభాం

శిథిలావస్థకు చేరిన వంతెన

రాకపోకలు సాగించడంతో ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుందని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం ఈ వంతెన కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, అదే జరిగితే సుమారు 34 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారీ లోడ్లుతో లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించడం వలన ప్రధాన రహదారి గోతులమయంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. ఇదే విషయాన్ని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు జరిపి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముఖ్యంగా గుత్తావిల్లి, కొల్లివలస రహదారికి మరమ్మతులు జరపాలని, తద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- లావేరు

రైతులకు యూరియా కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు లావేరు మండల తహశీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంటలకు అవసరమైన యూరియా రైతులకు కొందామంటే దొరకడం లేదని, వేరే ఎరువులు, లేదా పురుగు మందులు కొంటేనే యూరియా ఇస్తామని వాటిని అంటగడుతున్నారని, అధిక ధరకు యూరియా అమ్ముతున్నారన్నారు. పంట పెట్టుబడులకు రైతు భరోసా సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, వెంటనే రైతు భరోసా డబ్బులు జమ చేయాలన్నారు. సన్న, చిన్నకారు, కౌలు రైతులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాలని, పంటలకు కనీస మద్దతు ధర రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని, కరువు, వరదలు కారణంగా నష్టపోయిన పంటలకు భీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. తోటపల్లి కాలువ పూడికలు తీసి తోటపల్లి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతాంగాన్ని

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమణ, కౌలు రైతులు

ఆదుకోవాలని కోరారు. రైతాంగానికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సబ్సిడీలు ఇచ్చి ఎరువుల ధరలు తగ్గించాలని, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు ఐ.సూర్యనారాయణ, ఎల్.శ్రీనివాసరావు, డి.గురువులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సామూహిక ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

స్వచ్ఛతపై సామూహిక ప్రతిజ్ఞ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బెల్లుపడలోని కెజిబివి విద్యార్థులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శిరీష విద్యార్థులకు పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, సచివాలయ వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

టెక్కలి : మనం విధులు నిర్వర్తించే పరిసరాల్లోని మన ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆర్‌టిసి డిపో మేనేజర్ బి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా డిపో పరిధిలోని గురువారం చెత్త మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. పరిశుభ్రత అంశంపై ప్రయాణికులకూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇన్‌ఛార్జి ఎం.రామారావు, సెక్యూరిటీ బ్రాంచ్ ఇన్‌ఛార్జి శ్రీధర్, అసోసియేషన్ నాయకులు జి.ఎన్.భూషణం, ఎస్.ఆర్.మురళి, బి.మన్మథరావు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక సచివాలయం ప్రాంగణంలో పంచాయతీ సెక్రటరీ డి.జానకి స్వరూపిణీ ఆధ్వర్యాన చెత్త రహిత పంచాయతీగా కృషి చేస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జి.వి.పైడరాజ్, డి.వి.శ్రవణ్ కుమార్, వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, అనిల్, మహిళా పోలీసులు, వెలుగు సిసి అరుణజ్యోతి, విఒ అధ్యక్షులు ఎల్.స్వాతి, బి.నాగవేణి, మహిళా సంఘం సభ్యులు, ఆశా వర్కర్లు కె.గౌరి, పి.లత, జి.లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరపాలక సంస్థ ఆధ్వర్యాన ప్రజల్లో స్వచ్ఛతపై అవగహన కల్పించడానికి వినూత్న రీతిలో ప్రదర్శన చేపట్టారు. గురువారం చేపట్టిన ఈ ర్యాలీలో నగరంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని స్వచ్ఛత పాటిస్తామని ప్రతిజ్ఞ

శ్రీకాకుళం అర్బన్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చేశారు. స్వచ్ఛతాహీ సేవ 2024లో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాద్, మున్సిపల్ మెల్తాపీసరు డాక్టర్ సుధీర్‌కుమార్‌లు పర్యవేక్షించారు. ఏడురోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టి అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, మెప్మా, ఆశావర్కర్లు, లైన్స్‌క్లబ్, రోటరీ క్లబ్, ఇతర ఎన్.జిఒలు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- పలాస

సందీప్‌కుమార్ మృతదేహం

మండలంలోని మొగిలిపాడు జాతీయ రహదారి వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తున్న సందీప్ కుమార్ (22) మృతి చెందారు. జాతీయ రహదారి మొగిలిపాడు రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన మృతుడు విఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు జీడి పప్పును రవాణా చేయడానికి వచ్చి బుధవారం రాత్రి మొగిలిపాడు వద్ద తన వాహనం నిలుపుదల చేసి బహిర్భూమికి వెళుతుండగా... గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇదే కంపెనీలో పని చేస్తున్న మంజీ దర్సింగ్ అనే డ్రైవర్ విషయాని గుర్తించి క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సిఐ డి.మోహనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

గాయపడిన క్షతగాత్రులు

పొందూరు: పట్టణంలోని మేదరవీధి సమీపంలో గురువారం ఆటోబోల్తా పడి నక్కపేటకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు జి.సిగడాం మండలంలోని చెట్టు పొదిలాంలో పరామర్శకు వెళ్లి తిరిగి స్వగ్రామం నక్కపేట వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఎదురుగా ద్విచక్ర వాహనం రావడంతో ఆటోడ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న పొగిరి సన్యాసిరావు, వారణాసి సంగం చేయి విరగ్గా, పలువురు మహిళలకు గాయాలయ్యాయి. అలాగే ద్విచక్ర వాహన దారుడు కూడా గాయపడ్డాడు. వీరందరికి పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కొరకు 108లో శ్రీకాకుళం తరలించారు.

పుస్తెలతాడు చోరీ

ఆమదాలవలస : మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని ఆనందపురం కాలనీకి చెందిన వృద్ధుడు చింతాడ వెంకటరమణ తన భార్య రంగమ్మతో కలిసి పాలకొండ వెళ్లి తిరుగు ప్రయాణంలో ఫ్లై ఓవర్ దిగువున ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద బస్సు దిగారు. అక్కడి నుంచి పట్టణంలో ఉన్న తన కుమారుడు ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం వేచి చూస్తుండగా ఓ ఆటోతో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి వీరిని ఆటోలో ఎక్కించుకొని కొంత దూరం వెళ్లాక వెంకటరమణ భార్య మెడలో ఉన్న సుమారు రెండు తులాల పావు పుస్తెలతాడును తస్కరించి వీరిని మార్గమధ్యలో విడిచిపెట్టి వెళ్లిపోయినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎస్ఐ కె.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌ను కలిసిన రెడ్డి శాంతి

జగన్‌తో రెడ్డి శాంతి

పాతపట్నం : వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే రెడ్డి శాంతి మర్యాదపూర్వకంగా కలిశారు. పాతపట్నం నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తలకు అండగా ఉండాలని జగన్ సూచించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.

కనిమెట్టలో ఖాళీగా ఉన్న సచివాలయం

సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

పొందూరు: ప్రజలకు సకాలంలో సేవలు అందించాల్సిన సచివాలయ సిబ్బంది ప్రతిరోజు సమయపాలన పాటించడం లేదంటూ మండలంలోని కనిమెట్ట గ్రామస్తులు గురువారం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం 11.15 గంటలకు విఆర్‌ఎతో పాటు కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. దీంతో సిబ్బంది కోసం ప్రతిరోజు ఎదురు చూడాల్సి వస్తుందని, సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. దీనిపై సచివాలయ కార్యదర్శి వెంకట రామరాజీవ్‌ను ప్రశ్నించగా తాను గోకర్ణపల్లి ఇన్‌ఛార్జి కార్యదర్శిగా అదనపు బాధ్యతలు చేపడుతున్నానని, అక్కడకు తాను వెళ్లడంతో ఎవరు సమయానికి రాలేదో తనకు సమాచారం లేదని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది సమయానికి హాజరు కాకపోవడంతో ఎంపిడిఒ హరిహరరావు దృష్టికి తీసుకువెళ్లగా దీనిపై విచారణ జరిపి సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

42 జిఒను రద్దు చేయాలి

టెక్కలి : ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ... ప్రభుత్వం జారీ చేసిన 42 జిఒను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కళాశాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన అక్రమ జిఒ వల్ల రెగ్యులర్ అధ్యాపకులకు నష్టం కలుగుతుందన్నారు. ఉద్యోగోన్నతులు పొందే విషయంలో సాంకేతిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ జిఒను రద్దు చేయాలన్నారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఎ.రామారావు, వి.లూక్‌పాల్, సి.కవిత, వాసుబాబు, పి.వి.ఎన్.ఆచార్యులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న అధ్యాపకులు

సంక్షేమ పథకాలపై సమీక్ష

ఆమదాలవలస: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలతో ఎపిఎం పైడి కూర్మారావు శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో ఉదయం 5 గంటల నుంచే ప్రారంభించి బాధ్యతగా ఒక్కరోజులో పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని గ్రామ సంఘాల వారీగా సమీక్షించారు. మహిళా సంఘాల సభ్యులకు ఇస్తున్న ఉమెన్ లెడ్ ఎంటర్ ప్రైజస్ రుణాల ప్రగతిని సమీక్షించి ప్రతి గ్రామ సంఘంలో కనీసం పదిమందికి ఇప్పించాలన్నారు. మహిళలు

సిబ్బందితో సమీక్షిస్తున్న ఎపిఎం కూర్మారావు

ఉత్పత్తి చేస్తున్న ప్రోడక్ట్‌లను మార్కెటింగ్ చేసుకునేందుకు ఒఎన్‌డిసి (ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్)లో రిజిస్ట్రేషన్ చేయించి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి ఉన్నతి పథకం ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ రోజా, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, స్త్రీనిధి మేనేజర్ ఉదయ్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రామప్పడు, సుభద్ర రమణ, చంద్రరావు, విఒఎలు పాల్గొన్నారు.

కుమార్ నాయక్‌కు 'ఎక్సలెన్స్' జాతీయ అవార్డు

అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్

పలాస : స్వచ్ఛంద సేవా సంస్థలు, కళావేదికలు, ఉద్యోగ సంఘాలు, సాహితీ సంస్థలు, సినిమా సంఘాలు వంటి జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ, జిల్లా, గ్రామీణస్థాయిలో డాక్టర్ కుమార్ నాయక్ 60 సంఘాల్లో ఉంటూ విశేష సేవలు అందిస్తున్నారు. ఈ మేరకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ఆయన నివాసం హైదరాబాదులో గురువారం ఎక్సలెన్స్-24 జాతీయ అవార్డును గురువారం అందుకున్నారు. ఒక వ్యక్తి ఇన్ని సంఘాల్లో, వివిధ హోదాల్లో ఉంటూ నిత్యం సేవలందిస్తూ ముందుకు సాగడం ప్రశంసనీయమని గవర్నర్ కొనియాడారు.

గ్రంథాలయాల తనిఖీ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయాల సంస్థ అధికారి వి.కుమార్ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి నిర్వహనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నంద్యాలకు చెందిన గురు రాఘవేంద్ర ఇనిస్టిట్యూట్‌కి చెందిన వారు గ్రంథలాయానికి అందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. గ్రంథాలయానికి రావాల్సిన సెస్ నిధులు మంజూరు కృషి చేయాలన్నారు. ఈయతో పాటు గ్రంథాలయాధికారి బి.రూపావతి ఉన్నారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు గురువారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో పలు రికార్డులను, గ్రంథాలయం పనితీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. దాతలు ఎవరైనా ఉంటే పుస్తకాల రూపంలో సహకరించాలని కోరారు. పుస్తకాలను డిపాజిట్ దారులను పెంచాలని ఆదేశించారు. ఈయన వెంట గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ ఉన్నారు.

ఆక్రమణల తొలగింపుపై ఉద్రిక్తత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని తిర్లంగిలో ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలోని సర్వే నంబర్ 89/0లో షావుకారి నీలకంఠశ్వరరావు డ్రెయినేజీపై చేపట్టిన ఆక్రమణ నిర్మాణాన్ని తొలగించేందుకు గురువారం తహశీల్దార్ దిలీప్‌చక్రవర్తి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రొక్లెయినర్ సాయంతో వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు గ్రామస్థులు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. నోటీస్ లేకుండా తొలగింపు చర్యలు చేపట్టడం ఏమిటని నిలదీశారు. బాధితుడు నీలకంఠశ్వరరావు



అధికారులతో మాట్లాడుతున్న నీలకంఠేశ్వరరావు

మాట్లాడుతూ డ్రైయినేజీ ఎవరు ఉపయోగించడంలేదని, రాజకీయ కక్షతో తొలగించడాని ప్రయత్నం చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. మూడు అడుగుల డ్రెయినేజీపై నిర్మాణం తొలగిస్తానని, ప్రొక్లెయినర్‌తో తొలగించవద్దని కోరారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ... మూడు రోజుల్లో తొలగించాలని, లేకుంటే ఆ తరువాత తొలగిస్తామని హెచ్చరించారు.

మెరుగైన సేవలే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యమని ఫీల్డ్ జనరల్ మేనేజర్ శాలిని మీనన్ అన్నారు. కొత్త రోడ్డు జంక్షన్ వద్ద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతాదారులకు అత్యుత్తమ సేవలందించేందుకు మరింత చేరువగా ఉండాలనే లక్ష్యంతోనే నూతన శాఖను ప్రారంభించినట్లు తెలిపారు. రీజనల్ హెడ్ ఎం. వెంకట తిలక్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకులో గృహ, వాహన రుణాలతో పాటు

శ్రీకాకుళం అర్బన్ : ప్రారంభిస్తున్న ప్రారంభిస్తున్న శాలినీ మీనన్

వ్యక్తిగత, ప్రభుత్వ ఉద్యోగులకు రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఎంఎస్ఎం రుణాలు వ్యాపారులకు అతి తక్కువ వడ్డీకే అర్హతను బట్టి త్వరితగతిన మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిఆర్ హెచ్ రవి, సుబ్ నారాయణ్, చీఫ్ మేనేజర్లు గాయత్రి, చైతన్య, బ్యాంకు మేనేజర్లు శ్రీనివాస్, శ్రీను, నూతన శాఖ మేనేజర్ పి.అజయ్ కుమార్, ఉద్యోగ సంఘ నాయకులు శ్రీనివాస్, ఆఫీసర్ సంఘ నాయకులు తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: పట్టణంలో నూతన యూనియన్ బ్యాంకు శాఖను యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ షాలినిమీనన్ ప్రారంభించారు. యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎం.వెంకట్ తిలక్, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ ఎం.సూర్యకిరణ్, బ్రాంచి మేనేజర్ జి.బలరాం, డిప్యూటీ రీజనల్ హెడ్ పి.రవి, సర్పంచ్ గాడు నాగరాజు, మాజీ ఎంపిటిసిలు బూరాడ రమణ, కోరుకొండ సాయికుమార్, జె.వెంకటరమణ (జెవిఆర్), ఎంపిటిసి ప్రతినిధి బాడాన శేషగిరి, ఎపిఎం శ్యామలరావు పాల్గొన్నారు.

పొందూరు : కబడ్డీ ఆడుతున్న బాలికలు

ముగిసిన మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నోడల్ అధికారి, ఎంఇఒ-2 రాజారావు ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు గురువారంతో ముగిశాయి. రెండోరోజు బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాడ్మింటెన్, టెన్నీకాయిట్ పోటీలను నిర్వహించారు. మండలస్థాయిలో జరిగిన ఈ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన బాలురు, బాలికలు ఆమదాలవలస మండలం తొగరాంలో నియోజకవర్గస్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొంటారని ఎంఇఒ రాజారావు తెలిపారు. ఈ పోటీల నిర్వాహణలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.రవికుమార్, డి.ఉదయ్‌కుమార్, ఎస్.వి.రమణ, ఆర్.ఐ.నాయుడు, సిహెచ్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీలకు బంటుపల్లి విద్యార్థులు

రణస్థలం రూరల్: మండల స్థాయిలో నిర్వహిస్తున్న గ్రిగ్స్ ఆటల పోటీల్లో పాల్గొననున్న బంటుపల్లి హైస్కూల్ విద్యార్థులను గురువారం సర్పంచ్ ఎన్.రజిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెరుగైన ఫలితాలు సాధించాలని, విజేతలుగా నిలవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి

రణస్థలం రూరల్ : యూనిఫారాలు అందజేస్తున్న సర్పంచ్ రజని

కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే ఎమ్మెల్యే ఎన్ఇఆర్ తన సొంత నిధులతో అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రస్థాయి అవార్డు గతంలోనే సాధించామన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి యూనిఫారాలను తమవంతు బాధ్యతగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు : మండలంలోని ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత అవసరాల నిమిత్తం తమ ప్రాన్ ఖాతా నుంచి గత నెల 27న విత్ డ్రాకు దరఖాస్తు చేసుకున్నానని, 20 రోజులు అవవుతున్నా సబ్ ట్రెజరీ అధికారులు ఏ విధమైన నిర్ణయం తీసుకోవాలని యుటిఎఫ్ మండలశాఖ వాపోయింది. ఈ మేరకు జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి బోడ శ్రీను ఆధ్వర్యాన ఉపకజానాధికారికి యుటిఎఫ్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను వారం రోజుల్లో పరిష్కరించకుంటే సబ్ ట్రెజరీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అవలంగి శోభన్‌బాబు, కరకవలస విజయ్‌కుమార్, వై.మధుసూదనరావు, ఆర్థిక కార్యదర్శి వీరభద్రరావు, దినేష్, కృష్ణ, బాలకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- నందిగాం

వరిలో యాజమాన్య పద్ధతులు క్రమం తప్పక పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా యువ కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని దేవలపద్రలో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. వరి పైరుపై యాజమాన్య పద్ధతులను, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై వివరించారు. ఎకరానికి 15 నుంచి 20 కేజీలు పొటాష్, యూరియా 15 కేజీలు వినియోగించాలని సూచించారు పొటాషి వినియోగం వల్ల గింజ నాణ్యత, బరువు, చీడపీడల తట్టుకునే

అవగాహన కల్పిస్తున్న కృష్ణారావు

సామర్థ్యం పెరుగుతుందన్నారు. అలాగే అదనపు దిగుబడుల పొందవచ్చునని పేర్కొన్నారు. టెక్కలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు వరికి వచ్చే తెగుళ్లు, చీడపీడల నివారణ గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలని తెలియజేశారు. చీడపీడల నివారణకు ప్రకృతి వ్యవసాయంలో జిల్లేడు పత్ర ద్రావణం చేయు విధానంపై అవగాహన కల్పించారు. వివిధ కషాయాలు చేయ పద్ధతి రైతులకు తెలియజేయాలన్నారు. మండల ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ, టిడిపి నాయకులు ఎం.బాలకృష్ణ, సరళ ప్రసాదరావు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మానసవీణ పాల్గొన్నారు.

పూడికలను తొలగిస్తున్న రైతులు

రైతుల శ్రమదానం

ప్రజాశక్తి- టెక్కలి

వంశధార కాలువలో పూడికలు పేరుకుపోవడంతో పంట పొలాలకు సాగునీరు రావడం లేదు. దీంతో ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులు తెలియజేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో రైతులు నడుంబిగించారు తమ పంట పొలాలకు సాగునీరు కల్పన దృష్ట్యా వారే స్వచ్ఛందంగా ముందుకొచ్చి శ్రమదానంతో పిల్ల కాలువలోని పూడికతీత పనులను చేపట్టారు. మండలంలోని అక్కవరం పంచాయతీ పరిధిలో శ్యాంసుందరాపురానికి చెందిన రైతులు పూడికతీత పనులు చేపట్టారు. శ్యాంసుందరాపురం నుంచి తిర్లంగి వరకు గల కాలువలోని పూడికతీత పనులు చేపట్టారు. సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి, ప్రతినిధి అప్పలనాయుడు ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో గుంట నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు నిరుద్యోగభృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న వారికి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన రూ.మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు సహాయక కమిషనర్ బిఆర్‌వివి ప్రసాద్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థి చిరునామా, ఆధార్ నెంబర్, వేద విద్య అర్హత కలిగిన ఎటెస్టడ్ సర్టిఫికేట్ కాపీలు, ఎక్కడా ఉద్యోగం చేయడం లేదని స్వీయ వాంగ్మూలం, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ ఇతర వివరాలతో కూడిన దరఖాస్తులను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా పాలకొండ రోడ్డులో ఉన్న జిల్లా దేవదాయ శాఖ అధికారి కార్యాలయంలో స్వయంగా హాజరై అన్ని ఒరిజినల్స్‌తో దరఖాస్తులు అంద జేయాలన్నారు.

మైనర్లు వాహనాలు నడపరాదు

మందస : మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ ఖాదర్ భాష హెచ్చరించారు. మండలంలోని హరిపురం రోడ్డులో ముగ్గురు లైసెన్స్‌లు లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వారిని గురువారం గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారరు. అలాగే హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలపై అతివేగంగా వెళ్లరాదన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లు వాడరాదన్నారు. కళాశాలలు విడిచి పెట్టే సమయాల్లో విద్యార్థులు ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం లైసెన్స్ లేని వారికి అపరాధ రుసుం విధించారు.

గోశాల నిర్మాణానికి స్థల పరిశీలన

టెక్కలి రూరల్ : వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు పట్టణంలో గోశాల నిర్మాణానికి అధికారులు గురువారం స్థలాన్ని పరిశీలించారు. వంశధార శాఖ సంబంధించిన స్థలంలో గోశాలకు ఎకరా స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి నిర్మాణం చేపట్టడానికి అధికారులు సిద్ధమయ్యారు. కార్యక్రమంలో సంయుక్త సంచాలకులుడా మురళీధర్, ఉప సంచాలకులు డాక్టర్ జయరాజ్, టెక్కలి డివిజన్ సహాయ సంచాలకులు డాక్గర్ రఘునాత్, ఎంపిడిఓ సిహెచ్.లక్ష్మీబాయ్, పంచాయితీ విస్తరణాధికారి బి.మల్లేశ్వరరావు, ఎపిఒ బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కుమారి

ఇచ్ఛాపురం: మండలంలోని కొఠారి పంచాయతీలో పూర్ణాటకంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింకేవర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సు గురువారం నిర్వహించారుర. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఉప్పాడ కుమారి మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రోగులపై వివక్షత, చిన్నచూపు చూడరాదన్నారు. కార్యక్రమంలో ఉప్పాడ దేవరాజు, రుక్మాంధర, 104 సిబ్బంది, ఆశా వర్కర్ పుష్ప, డిఆర్‌పి నాగభూషణం పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో అన్నదానం

మెళియాపుట్టి : మండలంలో మెళియాపుట్టిలో రెడ్డికి వీధిలో సింహగర్జన యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యాన గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి యాత్రికులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఎ.రాజశేఖర్‌రెడ్డి, బసవ పరమేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయింత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్‌శాఖ అధికారి జి.శంకరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేట, కోటబొమ్మాళి, బంజేరుపేట, సీతన్నపేట, దుర్గంపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలాస : మండలంలోని మామిడిపల్లి 11 కెవి విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలపై వేలాడుతున్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పలాస డివిజన్ ఇఇ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బొడ్డపాడు కాలనీ, మామిడిపల్లి, మర్రిపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మందస : ఉద్దానం, హోనాలి ఫీడర్లకు అనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. మండలంలోని బేతలాపురం, రట్టి, సువర్ణపురం, హరిపురం టౌన్, బాలిగాం, సిరిపురం బుదర్సింగి, పొత్తంగి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలపుదల చేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

స్టడీ మెటీరియల్‌ను అందజేసిన క్రాంతికుమార్

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక శాఖాగంథాలయం పాతపట్నంలో కొరికాన ఫౌండేషన్ ఆధ్వర్యాన టెట్, డిఎస్‌సికి సంబంధించిన స్టడీ మెటీరియల్స్‌ను జనసేన యువ నాయకులు నక్క క్రాంతికుమార్ అందజేశారు. వీటిని నిరుద్యోగులకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రె కుమార్‌రాజు చేతుల మీదుగా స్థానిక శాఖాగ్రంథాలయానికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం గ్రంథాలయ అధికారి కాళ్ల రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత జూనియర్ అసిస్టెంట్ చిరంజీవి, మెళియాపుట్టి శాఖాగ్రంథాలయాధికారి ఆర్.అనురాధ పాల్గొన్నారు. అనంతరం కురికాల కాంపిటేటివ్ అకాడమీలో ఉచితంగా ఏర్పాటు చేసిన డిఎస్‌సి కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులకు కొరికాన సురేష్ మాస్టారు, డిఎస్‌సి ఫ్యాకల్టీ ఉపాధ్యాయుల చేతుల మీదగా ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితునికి సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సేవలకు ధనం అవసరం లేదని, అమూల్యమైన సమయాన్ని కేటాయించి సేవల్లో భాగస్వాములుగా ఉంటే చాలని లైన్స్‌క్లబ్ సెంట్రల్ సెక్రటరీ డా. పైడి సింధూర అన్నారు. అంపోలు గ్రామానికి చెందిన ఉట్ల.హేమంత్ కుమార్ గత కొంత కాలంగా కేన్సర్‌తో పోరాడు తున్నాడు. అత్యవసర పరిస్థితిలో ఆయనకిచ్చే ఇంజక్షన్ ఖరీదైనది కావడంతో కుటుంబ సభ్యులు దాతల సహకారాన్ని కోరారు. లయన్స్ క్లబ్ సెంట్రల్, సింధూర ఆస్పత్రి తరపున ఆయనకు వైద్య సహాయం అందించారు. వైద్యం అందించిన డాక్టర్ సింధూర మాట్లాడుతూ హేమంత్ అనారోగ్య కారణంగా కుటుంబ పోషణ కూడా

వైద్యసాయం అందజేస్తున్న డాక్టర్ సింధూర

కష్టతరమైందని, సహాయం చేయాలనుకునే వారు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ఉమా శంకర్, సింధూర ఆస్పత్రి టెక్నీషియన్స్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

పరిశీలిస్తున్న ఎఒ చిరంజీవి

పోలాకి: రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో తాను వేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని, అలాగే ఇకెవైసి చేయించాలని వ్యవసాయ అదికారి చిరంజీవి సూచించారు. మండలంలోని పోలాకి, చెల్లాయివలస రైతు సేవా కేంద్రాల్లో గురువారం నిర్వహిస్తున్న ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పంటను విక్రయించేందుకు, రైతు భరోసా పొందేందుకు, పంటల ఇన్సూరెన్స్ తదితర పథకాలు పొందాలంటే తప్పకుండా ఈ-క్రాప్ చేయించాల్సిందేనని అన్నారు. మండలంలోని 5,400 మంది రైతులు ఇంకా ఈ-క్రాప్ చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ నెల 23లోగా అవకాశం ఉందని, రైతులు ఈ-క్రాప్ చేయించాలన్నారు. కార్యక్రమంలో చెల్లాయివలస అగ్రికల్చర్ అసిస్టెంట్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత మనదే

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలం బాతువలో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిప్యూటీ మేనేజర్ ఆర్. హరిబాబు, ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ మొక్కలను సంరక్షించుకోవడం మన అందరి బాధ్యతన్నారు. ఏరియా మేనేజర్ తవిటి నాయుడు మాట్లాడుతూ మొక్కల వలన ప్రాణవాయువు లభిస్తుందని, మొక్కలను సంరక్షించే బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి డబ్బాడ ఆదినారాయణ, ఎంపిటిసి ప్రతినిధి బూటు అప్పారావు, కునుబిల్లి కుర్మరావు, రెడ్డి అసిరి

మొక్కలు నాటుతున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

నాయుడు, హరిత సోసైటీ వాలంటీర్ కలిశెట్టి ఆదినారాయణ, రెడ్డీస్ ఫౌండేషన్ మండల సమన్వయకర్త టంకాల మోహన్ రంగ, సచివాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో నెలకున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్ఆర్‌యుసిసి సభ్యులు కట్టా సూర్యప్రకాశరావు కోరారు. ఈ మేరకు కుర్దా రైల్వే డివిజనల్ మేనేజర్ బజ్వను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ పడమర వైపునకు ప్రవేశ ద్వారం అభివృద్ధి చేయాలన్నారు. అంతర్గత రోడ్డును అభివృద్ధి చేయాలన్నారు. పాతాళేశ్వర ఆలయం, డిగ్రీ కళాశాల వెళ్లేందుకు అండర్ పాసేజ్ నిర్మాణాలను చేపట్టాలన్నారు. ఒకటి, రెండు ఫ్లాట్ ఫారాల్లో లిఫ్ట్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న వంతెన రత్తకన్న వైపు

వినతిపత్రం అందజేస్తున్న సూర్యప్రకాశరావు

పొడిగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వి.కె.ప్రసాద్, ఉల్లి రాజు, చెక్కా గోపాల్, మందస రోడ్ యూజర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. గురువారం పురపాలక సంఘం ఐదవ వార్డు పరిధిలోని అక్కివలసలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్‌కార్డు, అకౌంట్ వివరాలు అడిగితే వివరాలు చెప్పవద్దని సూచించారు. ఎటిఎం కార్డు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం జీవన్ జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన పథకాలను వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిఒ కె.వినోద్, ఆర్‌పిలు లక్ష్మీ కామేశ్వరి, జయ లక్ష్మి, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన ఫలితాల సాధనకు తల్లిదండ్రులు కృషి అవసరమని ప్రిన్సిపాల్ వి.శంకరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల చదువు, క్రమశిక్షణ విషయంలో అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థులు కళాశాలలో గడిపే సమయం కంటే తల్లిదండ్రుల వద్దనే ఎక్కువ ఉంటున్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. అలాగే ఇంటి వద్ద కళాశాలకు వచ్చి వెళ్లే సమయాల్లో

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకరరావు

విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తుండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.సుధాకర్, ఎన్.బాపూజీ, బి.కరుణాకరరావు, వై.జనార్ధనరావు, జానకిరామ్, కిరోమని తదితరులు పాల్గొన్నారు.

సహారా బాధితులను ఆదుకోవాలి

మాట్లాడుతున్న సహారా మేనేజర్ కోటీశ్వరరావు

నరసన్నపేట : సహారా ఇండియాలో ఎంతో మంది పాలసీ ద్వారా కొన్ని లక్షల రూపాయలు కట్టి మోసపోయామని, మేము కట్టిన డబ్బులు చెల్లించాలని బాధితులు కోరారు. నరసన్నపేట కేంద్రంలోని సహారా బ్రాంచ్ మేనేజర్‌ను గురువారం కలిసి తమ గోడు వెల్లబుచ్చారు. తాము ఎన్నో సంవత్సరాలుగా కట్టి పాల్సీలు మెట్యూరిటీ కాలం అయినా డబ్బులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కొమనాపల్లి కోటీశ్వరరావు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి నగదును చెల్లిస్తామని అన్నారు. సంస్థ కూడా సిసిఆర్ ప్రకారం 2023 మార్చి నెల లోపు పూర్తయిన వాటికి రూ.పది వేలు చొప్పున చెల్లిస్తుందని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఇచ్ఛాపురం : మండలంలో అరకభద్ర పంచాయతీలో గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిపి బోర పుష్ప పాల్గొని మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదర్థాలు, ఆకుకూరలు, చిరుదన్యాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నీలవేణి, హెచ్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస : పౌష్టికాహారంతోనే గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యం సాధ్యమవుతుందని టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో గురువారం పోషణ పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారుర. పౌష్టికాహారంతో కలిగే లాభాలను వివరించారు.

మాట్లాడుతున్న ఎంపిపి పుష్ప

కార్యక్రమంలో గుర్తం తులసీరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్ ఉర్నాన దానమ్మి, కార్యదర్శి మీనాకుమారి, మోహనరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.